—ఎమ్. ఎస్. వెంకటేశ్వరరావు



ఉదయం మేడమీద దక్షిణం వైపు గదిలో ఉయ్యాలబల్ల మీద కూర్చుని ఉన్నారు శ్రీనివాసరావుగారు.

ఆ బల్లఉయ్యాలను సాధారణంగా వారు ఉపయోగించరు. మనసు ఆలోచనలతో బరువెక్కినప్పుడు ఉపశాంతిగా ఆ ఉయ్యాలబల్లమీద గొలుసుకు జారగిలబడి కూర్చుంటారు. ఆ విషయం వారి అర్ధాంగి అనూరాధకు బాగా తెలుసు. అట్టి స్థితిలో భర్తను చూసినప్పుడు వారి చెంత ఆపేక్షతో కూర్చుని, పాదాలతో నేలను నొక్కి వదులుతూ ఉయ్యాల నెమ్మది నెమ్మదిగా ఊగిస్తుంది. అలా చేయకుండా ఉపేక్ష చేసిన రోజున ఆ భార్యాభర్తలకు ఏవో మాటపట్టింపులు వచ్చినట్లే లెక్క.

కిటికీలగుండా చల్లని గాలి వీస్తూ ఉంది. శ్రీనివాసరావుగారు గదిలో

99

స్వార్థం మనిషిని అక్రమానికి పురిగొలుపుతుంది. మాతృప్రేమలో స్వార్థం లేకున్నా కడుపుతీపి యధార్థాన్ని ఆలోచించ నివ్వదు. దౌర్జన్య ప్రవృత్తి, ద్రోహబుద్ధి అధికారపు హస్తంలో పీఠం వేసుకొన్నప్పుడు తాత్కాలికమైన విజయాలను సాధించినా, నిలకడ మీద తెలిసిన నిజం అనే చక్రబంధంలో చిక్కుకున్నప్పుడు నిజాయితీ నిండుగా నవ్వుతుంది

99

గోడలకు తగిలించబడి ఉన్న ఫోటోల వంక చూస్తూ ఏదో ఆలోచిస్తున్నారు. అప్రయత్నంగా వారి పెదవుల కొసను ఆహ్లాదపురేఖ విరిసి వెలిసింది. 'కుమారులు తమకంటె వృద్ధిలోకి రావాలని తండ్రులు ఆశిస్తారు... వారి అభివృద్ధికి కృషి చేస్తారు' అని మనసులో అనుకున్నారు.

అక్కడ ఉన్న ఫోటోలతోపాటు తన ముత్తాతఫోటో కూడా ఉండేది ఇదివరకు. అన్ని ఫోటోలు ఉంచి ఆ ఫోటో మాత్రం తరవాత తీసివేసింది అనూరాధ. తన ముత్తాత, రంగనాయకులుగారు ఆఫీసు జవానుగా పనిచేశారు. తన కుమారుడికి చదువు చెప్పించి తనకు చదువులేని కొరత తీర్చుకున్నారు రంగనాయకులుగారు.

జీవకళ ఉట్టిపడుతున్న సుందరంగారి ఫోటోవంక చూశారు శ్రీనివాసరావుగారు. పంచ కట్టుకొని, కోటు వేసుకొని, తలపాగా చుట్టుకొని ఉన్నారు సుందరం గారు. సుందరంగారు శ్రీనివాసరావుగారి తాతగారు. వారు ఆఫీసు గుమాస్తాగా ప్రవేశించి, ఆఫీసరుగా ప్రమోషను పొంది మరీ రిటైరయ్యారు. తనకంటె ఉన్నత స్థితిలోకి రావాలని వారి కుమారుణ్ణి ఇంజనీరింగ్ కోర్సు చదివించారు సుందరం గారు.

శ్రీనివాసరావుగారి దృష్టి నారాయణ రావుగారి ఫోటోపైకి ప్రసరించింది. వారే శ్రీనివాసరావుగారి తండ్రిగారు. ఫుల్ సూటులో హుందాగా ఉన్నారు. నారాయణరావుగారు సూపరింటెండింగ్ ఇంజనీరుగా పేరు ప్రఖ్యాతులు గడించి రిటైరయ్యారు.

'అట్టడుగు పదవినుండి ప్రారంభించి మెట్టు మెట్టుగా పైకి వచ్చి వెలుగు చూడగలిగింది మా వంశం' అని మనసులో అనుకున్నారు శ్రీనివాసరావుగారు. ఆ వెంటనే ఆ గదిలో ఉన్న తన ఫోటో మీదకు చూపు మళ్లింది. తడబాటుతో కనురెప్పలు రెపరెపలాడాయి. అదే సమయంలో ఆ గదిలో కిలకిల నవ్వులు ఒలికాయి. తల తిప్పి చూశారు శ్రీనివాస రావుగారు. అనూరాధ బుగ్గమీద చూపుడు వేలు పెట్టుకుని విడ్డూరంగా తన వంక చూస్తూంది.

శ్రీనివాసరావుగారికి చిన్నతనంలో చదువుమీదకన్న నాటకాల మీద, విద్యార్థి నాయకుల ఎన్నికల మీద, విద్యార్థుల సమ్మెలమీద ఎక్కువగా మనసు నిలిచేది. పై చదువులు లేకపోతేనేమి, ఆఫీసరు ఉద్యోగాలు లేకపోతే నేమి—ఎమ్. ఎల్. ఏ. గా తాతతండ్రులకి తీసిపోని పేరుప్రతిష్ఠలు సంపాదించారు. వయసు మళ్లటంతో రాజకీయాలనుండి విరమించి ప్రస్తుతం ప్రశాంతంగా కాలం గడుపుతున్నారు. వార్ధక్యం పైబడి తల నెరిసి పోయినా జవసత్త్వాలు ఉడుగలేదు. ముఖంలో కళ తరగలేదు.

"ఏం? ఈవేళ మీ తాతగారి మీదికి, తండ్రిగారి మీదికి మనసు పోయింది... వారిలా మీరూ ఆఫీసరు ఉద్యోగం చేయలేకపోయామే అని చింతిస్తున్నారా? ఆ కొరత మీ అబ్బాయి తీరుస్తున్నాడు లెండి" అన్నది అనూరాధ—గలగల నవ్వుకుంటూ తిరిగి ఆ గదిలో నుండి వెళ్లిపోయింది. వార్ధక్యపు ఛాయలు గోచరిస్తున్నా ఆమెలో నిండుతనం, ఉత్సాహం ఇంకా తరిగిపోలేదు.

శ్రీనివాసరావుగారి మనసు మళ్లీ ఆలోచనామయమయింది. కొన్ని మధుర స్మృతులు; కొన్ని దుర్భర స్మృతులు. ఇదే గది అనూరాధకు, తనకు కొన్నాళ్లు ప్రేమాంగణంలా మారేది; కొన్నాళ్లు రణరంగంలా మారేది. ఇప్పుడు ఈ గదికీ వార్ధక్యం వచ్చింది. ఈ గది వాతావరణానికీ తటస్థ వైఖరి అబ్బింది. గత స్మృతులలో ఒక సంఘటన శ్రీనివాసరావుగారి మనసులో ఇప్పటికీ కనపడని కంటకంలా కలుక్కుమంటూనే ఉంటుంది.

సరిగా అయిదు సంవత్సరాల క్రితం ఇదే గదిలో అనూరాధ తన మీద ఘోర యుద్ధం ప్రకటించింది. ఆ యుద్ధం నెల్లాళ్లు కొనసాగింది.

బరువెక్కిన వారి మనసు బయటకు వచ్చి ఎదుట నిలిచిన ట్లయింది. ఆ మనసు శ్రీనివాస రావుగారితో ఇలా చెప్పసాగింది: 'ఆరోజు అనూరాధ ఏమన్నదో జ్ఞాపకం ఉందా? — నీకు హృదయం లేదని అంది ... మమకారం లేదని అంది... కన్న బిడ్డని కాలితో తన్నే కసాయివాడివి అంది ... అయినవారికి ఆకుల్లోను, కానివారికి కంచాల్లోను పెట్టే పెద్ద మనిషివి అంది... ఇవన్నీ ఎందుకు అన్నదో గుర్తుందా? ... చేతిలో పని అయినా నీ కొడుక్కి ఆఫీసరు ఉద్యోగం వేయించలేదని... అప్పుడు నీ వేమన్నావో తెలుసా? ... దేశ పరిస్థితులు ఎంతగానో మారి పోయాయి. ఉద్యోగాలు లేక ఎంతమందో ఆకలికి అలమటిస్తున్నారు. మనవాడు పెద్ద చదువే చదివాడు. అయితేనేం? ముందు నిరాధారులకి ఉద్యోగాలు ఇవ్వాలి. తరవాతే మిగిలినవారికి. మన వాడికి ఇప్పుడు ఆఫీసరు హోదా ఒకటి తక్కువయిందా ఏమిటి! భుక్తికి లోటు లేకుండా పెద్దలు సంపాదించిన ఆస్తి ఉంది. మన వాడికి వేయించే ఉద్యోగం ఒక పేద నిరుద్యోగికి దక్కితే ఒక కుటుంబాన్ని ఉద్ధరించినట్లవుతుంది. మనవాడే పాటు అంటావా — దేశానికి, ప్రజలకి ఉపయోగించే పరిశ్రమ మన శక్తికి మించనిది పెట్టమను. రాసూ పోయేటట్టుంటుంది. పది మందికి పని కల్పించి నట్లవుతుంది అని అన్నావు. కాని, నీ భార్య ససేమిరా తన కొడుక్కి ఆఫీసరు ఉద్యోగమే రావాలని పట్టు పట్టింది... ససేమిరా అలా కోర్కెని నీవూ పట్టుపట్టావు ... మీ ఇద్దరి మధ్య మాటలు పెరిగాయి ... పట్టింపులు వచ్చాయి ... ఏది ఏమైనా నీకు నీవై నీ కుమారుణ్ణి ఉద్యోగానికి ఏమాత్రం ప్రయత్నం చేయలేదు. నీ మాటకు తిరుగు లేదని నిరూపించు కున్నావు ... హ్హ హ్హ ...'

ఆ మాటలు వెళ్లగొట్టుకొనటంతో మనసులోని కొంత బరువు దిగిన ట్లయింది. బయటకు వచ్చి ఎదుట నిలిచినట్లున్న మనసు తిరిగి వారిలో ప్రవేశించినట్లయింది.

అనూరాధ తన పట్టు విడవలేదు. ఇతరత్రా ప్రయత్నించి తన కొడుక్కి ఆఫీసరు ఉద్యోగం సంపాదించింది.

"ఏమండోయ్" అంటూ అనూరాధ ఒక పటం చేత్తో పట్టుకొని ఆ గదిలోకి ప్రవేశించింది. శ్రీనివాసరావుగారి ఫోటోకి పక్కగా గోడకు ఒక మేకు కొట్టి ఆ పటాన్ని అక్కడ తగిలించింది.




వంకరలలో వనిత

చిత్రం—ఎస్. బి. శ్రీరామమూర్తి (కాకినాడ-4)

శ్రీనివాసరావుగారు అటు తిరిగి చూశారు. అది శ్రీనివాసరావు గారి కొడుకు లక్ష్మణరావు ఫోటో. ఆ ఫోటోని చూసీచూడగానే ముఖం పక్కకు తిప్పి వేసుకున్నారు. అది గమనించిన అనూరాధ వారి దగ్గరకు వచ్చి, "ఏం? ముఖం అలా మాడిపోయిందేం ... మీ మాట కాదని మీ అబ్బాయి ఆఫీసరయ్యాడనా ... సంతోషించేది పోయి" అన్నది.

అనూరాధ మాటలకు అడ్డువస్తూ, "సంతోషంకూడానా మనకు. . . ఉద్యోగం చేయగానే సంబరంగాదు. . . కార్యనిర్వహణలో కీర్తి గడించినప్పుడే మనం సంతోషించాలి" అన్నారు శ్రీనివాసరావుగారు.

"మీ రెప్పుడూ ఇంతే. వా డేదో అపకీర్తి తెచ్చుకుంటున్నట్లుగా మాట్లాడతారేం?" అని మూతి ముడుచుకుని అక్కడినుండి విసురుగా వెళ్లిపోయింది అనూరాధ.

• • •

చీకటిరాత్రి. అడవి పరిసరప్రాంతం. అడవిపక్షులు ఉండి ఉండి ఉలికిపడి అరుస్తున్నాయి. పొదల మాటునుండి ఈలకోళ్ల ఈలలు గింగురుమని వినవస్తున్నాయి. నెలవంక నుండి ప్రసరించే సన్నని వెన్నెల వెలుగు విస్తరించి ఉన్న చెట్ల ఆకులపైనే నిలిచిపోతూంది. మధ్య మధ్య గాలి విసురుకు కొమ్మలు కదిలినప్పుడు చిరువెన్నెల నేలపైకి ఉరుకుతూంది.

జనసంచారం లేని ఆ ప్రాంతంలో దూరంనుండి ఒక గుండ్రని వెలుగు ముందుకు వేగంగా దూసుకు వస్తూంది. ఆ వెలుగుతోపాటు వస్తున్న శబ్దాన్ని బట్టి అది ఒక స్కూటరు అని విశదమవుతూ ఉంది. ఆ స్కూటరు వచ్చి ఒక మర్రిచెట్టు క్రింద ఆగింది.

స్కూటరుమీదనుండి దిగిన వ్యక్తి పొడవుగా, బలిష్ఠంగా ఉన్నాడు. స్కూటర్‌కి స్టాండ్ వేసి అటు ఇటు ఒకసారి చూశాడు. ఒక వేడి నిశ్వాసం వదిలి నల్లని టెరికాట్ పాంట్ జేబులో నుండి సిగరెట్ కేసు, స్ప్రింట్ లైటర్ తీశాడు. సిగరెట్ పెదవుల మధ్య పెట్టుకొంటూ తన రిస్ట్‌వాచీ వంక పరికించి చూశాడు. రేడియమ్ డయల్‌లో టైము స్పష్టంగా కనపడుతూంది. అర్ధరాత్రి పన్నెండు గంటలయింది. లైటర్‌తో సిగరెట్ వెలిగించుకొని, ఆ వెలుగులోనే తాను నిలబడినచోట పురుగూ పుట్రా ఉన్నదేమోనని చూసుకున్నాడు. ఆ వెలుగులో పాలిష్ చేయబడి ఉన్న అతని విలువైన బూట్లు నిగనిగ



అంత ఎత్తులో...

ఫోటో—డి. భద్రాజీ (మద్రాసు-17)

లాడాయి. అతని సమీపంలో ఉన్న ఒక రాతిమీద ఒకటి రెండు తొండలు తప్ప మరేమీ లేవు. లైటర్ ఆర్పివేసి సిగరెట్ కేసుతోపాటు పాంటుజేబులో పెట్టుకున్నాడు.

ఆ వ్యక్తికి ఆ పరిసరప్రాంతం చిరపరిచయమైనదిగా కనపడుతూంది. ఆ చీకటిలోనే ఒక దిక్కువైపు తదేకంగా చూడసాగాడు. ఎవరి కోసమో నిరీక్షిస్తున్నట్లు స్పష్టమౌతూంది.

మర్రిచెట్టు వెనకనున్న చెట్ల గుబురుల మాటుగా ఏదో నడిచిన ట్లయింది. అధాటుగా అటు చూశాడు. స్కూటర్‌కి ఉన్న బాగ్‌నుండి టార్చి లైట్ తీసి చప్పుడయిన వైపు లైటు ఫోకస్ చేసి చూశాడు. చెట్లకొమ్మలు కదిలాయి. కొమ్మలరాపిడికి కంగారు పడినందుకు సిగ్గుపడ్డాడు. 'ఛ. . . నేరస్థుల్ని పట్టుకోవలసిన ఆఫీసర్ని. తాటాకు చప్పుళ్లకు లెక్క చేయకూడదు' అని అనుకున్నాడు. టార్చిలైట్ ఆర్పివేసి యథాస్థానంలో పెట్టివేశాడు.

నేరస్థుల్ని పట్టుకోవలసిన ఆఫీసరు నిర్జన ప్రదేశంలోకి ప్రాణాలకి తెగించి ఒంటరిగా రావలసిన పని లేదు. నిరపాయంగా సిబ్బందితో రావచ్చు. కాని, లక్ష్మణరావుకి ఒంటరిగా రావటమే మామూలయింది. అలా రావటంలో అతనికి కలిసివచ్చే దెంతో ఉంది.

లక్ష్మణరావు ఇంతకుముందు చూస్తున్న దిక్కువైపే ఇంకా చూడసాగాడు. ఆ దిక్కు నుండి రెండు దీపాలు వేగంగా రావటం గమనించిన అతని ముఖం వికసించింది. ఆ విద్యుద్దీపాలు దగ్గరవుతున్న కొలదీ, గాలికి దూసుకువస్తున్న లారీ శబ్దం దగ్గరవసాగింది. ఆ లారీ లక్ష్మణరావు నిలబడిన మర్రిచెట్టు ముందునుండి వెళ్లాలి.

ఆ విధంగా వచ్చే లారీలను తనిఖీ చేయటం, బియ్యం దొంగరవాణా చేస్తున్న ఆ లారీలను వదిలివేయటం, జేబులు నింపుకోవటం అలవాటయింది లక్ష్మణరావుకి.

స్కూటర్‌ని దారికి అడ్డంగా పెట్టి, రివాల్వర్‌ని గురిచేసి పట్టుకున్నాడు లక్ష్మణరావు. సడన్ బ్రేకుతో నేలను కిర్రున రాసుకొంటూ లారీచక్రాలు ఆగిపోయాయి.

సర్కస్ సింహాన్ని నడిపించినట్లుగా రివాల్వర్‌తో భయపెట్టి, లారీ డ్రైవరు, లారీలో ప్రయాణిస్తున్న ఇద్దరు ఆసాములు క్రిందకు దిగేటట్లు చేశాడు. ఒక ఆసామీ పొడుగుగా, సన్నంగా ఉన్నాడు. నల్లని గిరజాలజుట్టు, బుంగమీసాలు అతనికి హుందాగా ఉన్నాయి. గ్లాస్కో పంచ కట్టుకొని, సిల్కులాల్చీ వేసుకొని ఉన్నాడు. *భుజాన సిల్కుకండువా ఉంది.* కుడిచేతి వేళ్లకు మూడు ఉంగరాలు, ఎడమచేతి వేళ్లకు రెండు ఉంగరాలు ఉన్నాయి. రెండవ ఆసామీ పంచ, లాల్చీ ధరించి నిరాడంబరంగా ఉన్నాడు. నడివయసు వాడయినా బట్టతల ఉంది.

సిల్కులాల్చీ ఆసామీ ఎంత ప్రాధేయపడుతున్నాడో, అంత నిష్కర్షగా మాట్లాడుతున్నాడు లక్ష్మణరావు. ఆఖరికి వారి సమస్య పరిష్కారానికి వచ్చింది. సిల్కులాల్చీ ఆసామీ జేబులోని కరెన్సీ నోట్లు కొన్ని లక్ష్మణరావు చేతిలోకి వచ్చాయి.

లక్ష్మణరావు నోట్లు లెక్కపెట్టుకొనటం ఆరంభించాడో లేదో, ఇంతవరకు ఎక్కడ దాగి ఉన్నాయోగాని రెండు వాహనాలు రయ్‌మని అటొకటి, ఇటొకటి దూసుకుని రాసాగాయి.

నోట్లు మడిచి నల్లని టెరిలిన్ షర్ట్ జేబులో పెట్టుకొంటూ, "అవికూడా నీ తాలూకువా?" అని అనుమానంగా ప్రశ్నించాడు లక్ష్మణరావు.

"కాదు. . . సి. ఐ. డి. ఆఫీసర్ల జీపులు" అన్నాడు సిల్కులాల్చీ ఆసామీ, ఒక కంట లక్ష్మణరావుని క్రీగంట చూస్తూ.

పండ్లతో బరువెక్కిన చెట్టు కొమ్మను హఠాత్తుగా గొడ్డలితో నరికినట్లయింది. లక్ష్మణరావు గుండెల్లో రాయి పడింది.

"మన విషయం వారికి చెప్పకు. చెప్పావో నిన్ను కాల్చి చంపేస్తాను. . . పీక నులిమేస్తాను" అంటూ కుడిచేత్తో రివాల్వర్ పట్టుకొని, ఎడమచేత్తో ఆ ఆసామీ పీకను గట్టిగా నొక్కిపట్టాడు లక్ష్మణరావు.

"ఆగు!" అధికారయుతమైన అరుపు మేఘగర్జనలా పైనుండి వినపడింది.

లక్ష్మణరావు పట్టు వదిలి ఆశ్చర్యంగా పైకి చూశాడు. మర్రిచెట్టు ఊడను పట్టుకొని పైనుండి ఒక దృఢకాయుడు క్రిందకు జారి వచ్చాడు. అతని భుజాన

ఉన్న ప్రీమియర్ స్పెషల్ లైట్ అమర్చబడి ఉన్న పోలీస్ కారేదో వేగంగా వచ్చింది.

అప్పటికే అక్కడికి ... వాళ్ల లైట్లు ఆ ప్రాంతం ... పెంపోయాయి.

లక్ష్మణరావు అయోమయావస్థలో ఉన్నాడు. తన ఎడమచేయి బక్కపలచ ఆసామీ హస్తాల్లోనూ, రివాల్వర్ ఉన్న తన కుడిచేయి ఊడసాయంతో దిగిన బలిష్ఠుని హస్తాల్లోను బంధింపబడినట్లు గ్రహించే పరిస్థితిలో లేడు. జీపుల నుండి దిగిన సి. ఐ. డి. ఆఫీసర్లపైన అతని దృష్టి నిలిచి ఉంది. అతనికి ముచ్చెమటలు పట్టాయి.

● ● ●

'నాన్నగారు మాజీ ఎమ్. ఎల్. ఎ. ఎంతో పలుకుబడి ఉంది. నాన్నగారు తలుచుకుంటే ఈ గండం నుండి గట్టెక్కించగలరు. నేను ఆపదలో చిక్కుకున్నట్లు అమ్మకు సూచనప్రాయంగా తెలియజేసినా చాలు — నాన్నని బతిమాలుతుంది; ఒప్పిస్తుంది; నన్ను రక్షిస్తుంది' అని మనసులో అనుకున్నాడు లక్ష్మణరావు.

ఏ విధంగానైనా తాను చిక్కుకొని ఉన్న ఉచ్చునుండి తప్పించుకొని బయట పడాలనే ఆశ ఉద్భృతమైంది లక్ష్మణరావుకి.

అధికంగా పైకం గుమ్మరించి ఒక అడ్వకేట్‌ను పెట్టుకున్నాడు.

తానే నేరం చేయలేదని నిర్మొహమాటంగా న్యాయాధికారి ముందు ప్రమాణం చేసి పలికాడు.

లక్ష్మణరావు నేరస్థుడని, అవినీతి పరుడని, అధికార పదవికి అనర్హుడని, దొంగవ్యాపారుల విశృంఖల విహారానికి, తిండిగింజలకు కొరత రావడానికి, ధరలు మిన్నంటటానికి లక్ష్మణరావు చర్య దోహదం చేస్తున్నదని, రెడ్ హేండెడ్‌గా పట్టుబడినా తన నేరాన్ని కప్పిపుచ్చుకొనేందుకు డెస్పరేట్ అటెంప్ట్ చేస్తున్నాడని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధారావాహికంగా వాదించాడు.

తన క్లయింటు నిరపరాధి అని నిరూపించడానికి శక్తివంచన లేకుండా వాదించాడు అడ్వకేటు.

ముందుగానే ఒక నిర్ణయానికి వచ్చి ఉన్నట్లుగా కేసు ప్రొసీడింగ్సులో ఏమీ శ్రద్ధ కనపరచటం లేదు జడ్జీగారు.

డిఫెన్సు కథనం ఇది: సిల్కులాల్చీ ఆసామీకి, మాజీ ఎమ్. ఎల్. ఎ. అయిన శ్రీనివాసరావుగారికి బద్ధవైరం ఉంది. పార్టీ వైషమ్యాలుకూడా పాతుకొని పోయి ఉన్నాయి. పుణ్యమూర్తులైన శ్రీనివాసరావుగారి జోలికి వెళ్లే చేవ లేక అమాయకుడైన శ్రీనివాసరావు గారి కొడుకును నేరంలో ఇరికించి తన సగ తీర్చుకో జూస్తున్నాడు ఆ సిల్కులాల్చీ ఆసామీ. బలవంతంగా సొమ్ము లక్ష్మణరావు చేతిలో తనకు తానై ఇరికించి లంచగొండి అనే అపవాదు అంటకట్ట జూస్తున్నాడు ఆ సిల్కులాల్చీ ఆసామీ. లక్ష్మణరావు నీతి, నిజాయితీ ఉన్నవాడు. పైగా దేశభక్తులు, త్యాగమూర్తులు అయిన శ్రీ శ్రీనివాసరావుగారి సుపుత్రుడు కూడాను.

పబ్లిక్ ప్రాసిక్యూటరు ఆగ్రహాన్ని అణుచుకొంటూ సిల్కులాల్చీ ఆసామీ దగ్గరకు వెళ్లి నిలబడి లక్ష్మణరావును— "వీరిని నీవు బాగా ఎరుగుదువా?" అని రెట్టించి ప్రశ్నించారు.

"బాగా ఎరుగుదుమ" అని లక్ష్మణరావు సమాధానమిచ్చాడు.

"పచ్చి అబద్ధం!"

"పచ్చి నిజం!"

సిల్కులాల్చీ ఆసామీ వీపుమీద ఎడమచేయి వేసి, కుడిచేతి చూపుడు వేలితో లక్ష్మణరావును హెచ్చరిస్తూ, "వీరికి, శ్రీనివాసరావుగారికి విరోధం ఉన్న మాట నిజమా?" అని ముక్కుసూటిగా ప్రశ్నించారు పబ్లిక్ ప్రాసిక్యూటరుగారు.

"అవును, అవును, అవును!" ఖండితంగా జవాబిచ్చాడు లక్ష్మణరావు.

అసహనంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ గారు సిల్కులాల్చీ ఆసామీ వంక తిరిగారు. రెండు చేతులు పైకెత్తి సిల్కులాల్చీ ఆసామీ తలపైనున్న విగ్గు తీసివేసి తటాలున లక్ష్మణరావువైపు తిరిగారు. ఆ ఆసామీ తన కృత్రిమమైన బుంగ మీసాలుకూడా తీసివేసుకున్నాడు. కోర్టుకు హాజరైన వ్యక్తుల నుండి హాహాకారాలు వెలువడ్డాయి.

ఆ సిల్కులాల్చీ ఆసామీ మరెవరో కాదు. వారే శ్రీనివాసరావుగారు!

అప్రయత్నంగా "నాన్నా!" అన్న మాటలు లక్ష్మణరావు పెదాల నుండి జారాయి. అతని తల గిరగిర తిరిగి పోయింది. శరీరం బలహీనమయి పోయింది. ముచ్చెమటలు పోశాయి.

శ్రీనివాసరావుగారు నేలపై చూపులు నిలిపి గంభీరంగా నిలబడి ఉండిపోయారు.

ముద్దాయి తరఫు అడ్వకేటు వదనం వాడిపోయింది.

శ్రీనివాసరావుగారి హృదయంలో పెల్లుబుకుతున్న భావాలు తరంగాలు తరంగాలుగా వారి ముఖంలో ప్రతిఫలించసాగాయి.

ఆర్ద్రహృదయులైన జడ్జీగారు శ్రీనివాసరావుగారి ముఖంలోకి సూటిగా చూడలేక, వారి పెన్నుకు ఉన్న కొత్త పాళీ పైకి చూపులు మళ్లించారు. ★


